క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారిగా చిరంజీవులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్-2 ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న డా.కె.చిరంజీవులు ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారిగా నియామితులైనట్లు ప్రిన్సిపాల్ కె.ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఏయూ వైస్‌చాన్స్‌లర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవులుకు ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

రెండోరోజు పరీక్షకు 450మంది హాజరు


పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 450మంది పదవతరగతి హిందీ పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. బలిజిపేట ఎ-కేంద్రంలో 149మంది, బి-కేంద్రంలో 138మంది, వంతరాంలో 163మంది హాజరయ్యారన్నారు. వంతరాం కేంద్రంలో ఒకరు ఆబ్సెంట్ అయినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసు పహారా గట్టిగా ఏర్పాటు చేశామని, మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

బస్సులు మధ్యలో ఆగిపోకుండా చూడండి


ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురంటౌన్: బస్సులు మధ్యదారిలో ఆగిపోకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలం నిడగల్లు, కూనేరు గ్రామాలకు నైట్ హాల్ట్ బస్సులు నడపాలని కోరారు. కాలం చెల్లిన బస్సులు రద్దు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో బస్సు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, విశాఖపట్టణానికి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని సూచించారు. కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి గేదెల రామకృష్ణ, నాయకులు గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు

పార్వతీపురం టౌన్: పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణ పరిధిలో గల మెయిన్ రోడ్, 20, 21 వార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్, అపరిశుభ్రంగా ఉన్న కాలువలను గుర్తించామన్నారు. సంబంధిత సెక్రటరీకి, మేస్త్రీకి త్వరితగతిన శుభ్రం చేయించాలని ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు, హెల్త్ సెక్రటరీ రామారావు, శానిటేషన్ సెక్రటరీ శ్రీనివాస్, మేస్త్రీ కుమార్ పాల్గొన్నారు.

వినియోగించేదెన్నడో..?


ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో దుమ్ము,ధూళితో ఉన్న అంబులెన్సులు

పార్వతీపురం: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న చందాన ఆరోగ్యశాఖ వ్యవహారం కనిపిస్తోంది. గిరిజనులకు అత్యవసర వైద్య సేవలనందించాలనే లక్ష్యంతో సినీనటుడు సోనూసూద్ 'సూద్ ఫౌండేషన్'ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నాలుగు అంబులెన్స్‌లను ఫిబ్రవరి 5న అందజేశారు అందులో రెండు అంబులెన్సులను పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించగా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. అప్పటి నుంచి అవి కార్యాలయంలోనే దుమ్ము, ధూళితో ఓ మూలన పడి ఉన్నాయి. అధికారుల నిర్వాకం వల్ల గిరిజనులకు అత్యవసర సేవలు అందని ద్రాక్షలా మిగిలి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వహణ లేక మూలన పడి ఉన్న అంబులెన్సులను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆధార్ నవీకరణకు అవకాశం

- అప్‌గ్రేడేషన్‌కు ప్రత్యేక శిబిరాలు
- తప్పులు సరిచేసుకునేందుకు కేంద్రాలు


బలిజిపేట సచివాలయంలో ప్రారంభమైన నవీకరణ ప్రక్రియ

బలిజిపేట: సంక్షేమ లబ్ధి, వ్యక్తిగత వివరాలు, గుర్తింపు తదితర అంశాలన్నింటికీ కేంద్ర ప్రభుత్వం ప్రామాణికంగా సూచించిన ఆధార్ ప్రతి ఒక్కరికీ అవసరం. దీనిని 2011లోనే ప్రారంభించినప్పటికి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో సన్నద్ధం కాకపోవడం వంటి కారణాలతో ఆధార్ జారీలో పలు సమస్యలు తలెత్తాయి. పుట్టిన పిల్లల నుంచి ప్రతి ఒక్కరికి ఆధార్ జారీ చేసినప్పటికీ, అందులోని వివరాల్లో పొరపాట్లు దొర్లినట్లు ప్రజలనుంచి వినతులు అందుతున్నాయి. సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు ఆధార్ వివరాలు సాంకేతికంగా అడ్డంకిగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు పక్కాగా ఉండేలా నవీకరణ చేసేందుకు కేంద్ర ప్రభత్వం ఎప్పటికప్పుడు అవకాశం ఇస్తోంది. ఆ మేరకు బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తోంది.

నవీకరణ ఎందుకంటే..

గతంలో ఆధార్ నమోదు చేసినప్పుడు కొంతమంది వివరాలు తప్పుగా నమోదయ్యాయి. అలాగే కొంతమంది వేలిముద్రలు పడడం లేదు. ఈ నేపథ్యంలో వేలిముద్రలు, ఐరిస్, ఫొటో, వయస్సు, చిరునామా వంటి వివరాలను నవీకరణ శిబిరాల ద్వారా సరిచేస్తారు. 2023 అక్టోబర్, 2024 ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో దశల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నవీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మరోమారు ఆధార్ నవీకరణ చేసేందుకు బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు బలిజిపేట మండల కేంద్రంలో అధికారులు ఏర్పాటుచేశారు.

ఆధార్ వృత్తాంతం

కేంద్రప్రభుత్వం తొలిసారిగా 2011లో ఆధార్ కార్డులు జారీ చేసింది. అప్పట్లో నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. పన్నెండేళ్లకోసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని అప్పట్లో కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు 2010-16మధ్య ఆధార్ పొంది, అప్పటినుంచి నవీకరణ చేసుకోని వారి కోసం గతంలో పలుమార్లు ప్రత్యేక శిబిరాలు నిర్వహించింది. ఈ సారి శిబిరాల ప్రధాన లక్ష్యం చిన్నారుల బయోమెట్రిక్ వివరాలను నవీకరించడం. ఐదు నుంచి ఏడేళ్ల మధ్య వయస్సు కలిగిన చిన్నారుల వేలిముద్రలను ప్రస్తుత శిబిరాల్లో ఉచితంగా నవీకరించనున్నారు.

ఈ విధంగా సరిచేస్తారు

ఆధార్ నవీకరణకు ఈ కార్డులు జారీ చేస్తున్న యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆధారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఐ)నిబంధనలు రూపొందించింది. దీని ప్రకారం ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారు ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని సందర్శించాలి.

- పుట్టిన తేదీ సరిచేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మార్కుల జాబితా లేదా పాస్‌పోర్ట్ లేదా పాన్‌కార్డును ఆధారంగా చూపాలి. వాటి కాపీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- చిరునామా మార్పునకు బ్యాంక్ ఖాతా, పోస్టాఫీసు ఖాతా, రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ అప్‌లోడ్ చేయాలి.
- చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేస్తారు. పిల్లలకు తొలిసారి ఆధార్ ఉచితంగా నమోదు చేస్తారు.

దీనిని సద్వినియోగం చేసుకుని ఆధార్ నవీకరణ చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఘన జీవామృతం తయారీ


వెంగళరాయపురంలో ఘన జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది, మహిళలు

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మిర్తివలస, సుభద్ర, వెంగళరాయపురం గ్రామాల్లో మహిళా సంఘాలకు ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ మండల ఇన్‌చార్జ్ లక్ష్మి ఆధ్వర్యంలో ఘనజీవామృతం తయారుచేశారు. 200కిలోల ఘన జీవామృతం తయారీకి 200కిలోల తాజా ఆవుపేడ, నాలుగు కిలోల బెల్లం, 4కిలోల పప్పుల పిండి, 20లీటర్ల గోమూత్రం, రెండు పిడికిళ్ల పుట్టమన్ను వినియోగించనున్నట్లు వ్యవసాయ శాఖ మండల ఇన్‌చార్జ్ లక్ష్మి తెలిపారు. బెల్లం, పప్పుల పిండి, పుట్టమన్ను తగినంత పూర్తిగా కరిగే వరకు విడివిడిగా కలుపుకుని మూడు మిశ్రమాలను 200కిలోల ఆవుపేడలో బాగా కలిసేంతవరకు ఉండలు లేకుండా మెత్తగా అయ్యేంతవరకు కలిపి ఆ పేడను నీడలో ఒక పట్టామీద లేదా టార్పాలిన్ మీద వారం రోజులు ఎండపెట్టుకోవాలని తెలిపారు. తరువాత ఘనజీవామృతం తయారవుతుందని దీనిని విత్తనాలతో పాటు ఎకరాకు 400కిలోలు చొప్పున కలిపి వేయడం వల్ల విత్తనాలకు తేమ శాతం, మొక్కలకు కావాల్సిన రోగ నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వంతెన సమస్య


పెదపారన్నవలస గెడ్డకు కాలినడకన వెళ్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు

సాలూరు: మండలంలోని పెదపారన్నవలస వంతెన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని పెదపారన్నవలసలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు తమ పంచాయతీ వంతెన సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపారన్నవలస పంచాయతీ ఇరువైపులా గెడ్డలు ప్రవహించడం వల్ల పట్టణం దగ్గర్లో ఉన్నప్పటికీ రవాణాసౌకర్యం, పిల్లల చదువులు, అత్యవసర పరిస్థితుల్లో చాలా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. వర్షాకాలంలో పూర్తిగా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై శంకరరావు మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

జీడి రైతులకు మద్దతు ధర కల్పించాలి


డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జీడి రైతులకు మద్దతు ధర కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మండంగి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా రెవెన్యూ శాఖాధికారి హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. కురుపాం, సాలూరు, సీతంపేటలో 100 పడకల ఆస్పత్రులు నిర్మించి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కానట్లయితే ఈ నెల 29న పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి కె.రామస్వామి, ఎస్ అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవ,తృణ ధాన్యాలు సాగు చేయాలి


మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు సాగుచేస్తున్న తృణ, నవ ధాన్యాల పంటలను పెంపొందించుకోవాలని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలం, అంటిపేట గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల వ్యవసాయ అధికారి రైతులకు పంటల వివరాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగుల సంఘం మహిళాధ్యక్షురాలిగా లత



సీతానగరం: నవ్యాంధ్ర ప్రదేశ్ నిరుద్యోగ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షురాలిగా ఎం.లతను నియమిస్తూ సంఘం అధ్యక్షుడు ఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సీతానగరం మండలంలోని పెదఓగిలి గ్రామానికి చెందిన ఎం.లత జిల్లాలోని నిరుద్యోగులైన మహిళల హక్కుల కోసం, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సేవలందిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎం.లత మాట్లాడుతూ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సీతానగరం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-2025విద్యా సంవత్సరం నుంచి పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదును కీర్తిశేషులు కొమ్మినేని కిశోర్ కుమార్ జ్ఞాపకార్థం ఇవ్వనున్నట్లు కొమ్మినేని కిశోర్‌కుమార్ తల్లి మాజీ సీడీసీ చైర్మన్ కొమ్మినేని లక్ష్మి నాగేశ్వరి కుటుంబసభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ 26న కిశోర్ కుమార్ పుట్టినరోజున ఈ నగదుబహుమతులను సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ: నిరుద్యోగులకు రాయితీపై అందించే రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రవర్ణ కులాలకు చెందిన పేదలకు 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉండి, తెల్లరేషన్ కార్డులు కలిగిన వారు అర్హులని తెలిపారు.

పేరుకే స్వచ్ఛ సంకల్పం

- పట్టణంలో కానరాని స్వచ్ఛత, పారిశుధ్యం


పార్వతీపురం రైల్వేస్టేషన్ రహదారిలో కాలువ


7వ వార్డు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలువార్డులు, రహదారుల వద్దగల కాలువలు శిథిలావస్థకు చేరడంతో స్థానికులకు కాలువలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలువలు పరిశుభ్రంగా లేకపోవడం , కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపించి అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. మరోవైపు దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించి ఫొటోలకే పరిమితమయ్యారే తప్ప పారిశుధ్యంపై దృష్టిసారించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి


డెప్పివలసలో ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జీవీ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పార్వతీపురం మండలంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని పార్వతీపురం ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అయన మండలంలోని డెప్పివలస, పుట్టురు, తాళ్ళబురిడి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే డీకేపట్నం సచివాలయంలో పి-4 సర్వే సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న పనులు అలసత్వం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల ప్రజలు అందుబాటులో ఉన్న సమయాల్లో వివరాలు సేకరించి పి-4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు.

జీజే కాలేజీలో అడ్మిషన్లు పెంచడానికి సహకరించాలి


ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తు చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: మండలకేంద్రంలో మౌలిక సదుపాయాలు కలిగిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్ల సంఖ్యను పెంచడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు కోరారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యాబోధనకు అవసరమైన వసతులున్నాయని, వాహనాల రాకపోకల సౌకర్యం ఉందని తెలిపారు. ఇక్కడి టెన్త్ విద్యార్థులంతా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని కోరారు.

మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలి

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం రూరల్: అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి మహిళ శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి ఫోన్ కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అవుతుందన్నారు. ప్రమాదంలో కానీ, అత్యవసర సమాయాల్లో కానీ ఫోన్‌ను 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందని చెప్పారు. దీంతో దగ్గర్లోని పోలీసులు 5 నిమిషాల్లో బాధిత మహిళల వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. అంతేకాకుండా ఇంట్లో నుంచి ఫిర్యాదు చేయవచ్చని, మిస్సింగ్ కేసు ఫిర్యాదులు ఈ యాప్ నుంచే చేయవచ్చని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ శక్తి టీమ్‌లు ఉదయం, సాయంత్రం కళాశాల ప్రాంగణాలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో, ప్రధాన కూడళ్లలో ఎప్పటికప్పుడు మఫ్టీలో గస్తీ తిరుగుతూ ఉంటారని తెలిపారు. మహిళలు, విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వీరు క్షుణ్ణంగా తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. శక్తి యాప్ ఉపయోగాలపై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు.


శక్తియాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన మహిళ

29న ఐటీడీఏ వద్ద ధర్నా జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: గిరిజనుల సమస్యల పరిష్కారం, మౌలిక వసతులు కల్పన తదితర సమస్యలపై ఈ నెల 29న ఐటీడీఏ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు మాట్లాడుతూ, గిరిజనులు, ఇతర పేదరైతులు పండిస్తున్న జీడి పంటకు కనీస మద్దతు లేకపోవడం వల్ల దళారులకు తక్కువ రేటుకే పంటను అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీడి పంటకు కనీసం కిలోకు రూ.200 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పై సమస్యలపై తలపెట్టిన ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జానకిరావు, మంచాల శ్రీనువాసరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

- మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్



పార్వతీపురం రూరల్: ప్రభుత్వం రైతులకు యాభై శాతం రాయితీపై ఆధునిక వ్యవసాయ పరికరాలు మంజూరు చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పరికరాలను 50శాతం రాయితీతో ప్రభుత్వం మంజూరు చేస్తోందని, రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ పరికరాలకు సంబంధించి ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటోవేటర్స్, పవర్ వీడర్, స్ప్రేయర్స్, తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఏఓ అశోక్ తెలిపారు.

వీరు కూడా అర్హులే

ఆర్ఓఎఫ్ఆర్ భూములను సాగుచేస్తున్న రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఏఐడీసీ) రైతులతో చర్చించి పరికరాల ధరలను నిర్ణయించి లబ్ధిదారులకు అందిస్తుంది. రాయితీ పోను రైతు చెల్లించాల్సిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో యూపీఐ లేదా నెఫ్ట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసేటప్పుడు ఓటీపీ కోసం ఆధార్ నంబర్‌కు అనుసంధానం అయిన ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

పత్రాలు తప్పనిసరి

దరఖాస్తు చేసుకునే రైతులు సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాలు

- ఆధార్ కార్డు
- పట్టాదార్ పాస్ బుక్ నకలు
- ట్రాక్టర్‌తో నడిచే వ్యవసాయ పరికరాల కోసం ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ పత్రం
- ఎస్సీ, ఎస్టీ రైతులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి
- బ్యాంకు పాస్ పుస్తకం

ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యారోగ్యశాఖ మార్గదర్శకాలు పాటించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కర రావు

పార్వతీపురంటౌన్: వైద్యారోగ్యశాఖ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను ప్రైవేట్ ఆస్పత్రులు అమలు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. ఈ మేరకు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యంతో బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల్లో నిర్వహించే ప్రతి ప్రసవానికి, కాన్పుకు సంబంధించి పూర్తి వివరాలు హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రసవం తరువాత జనన ధ్రువీకరణ పత్రాన్ని వారికి అందజేయాలని సూచించారు. కాన్పుల వివరాల నమోదు చేసే రిజిస్టర్ అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సాధారణ, సిజేరియన్ డెలివరీలు ఎన్ని నిర్వహించారో ఆస్పత్రుల వారీగా పరిశీలించారు. సీజేరియన్ డెలివరీ నిర్వహణకు తగు కారణాలు ఉండాలని, అలాగే శస్త్ర చికిత్స సమయంలో అనస్థీషియా వైద్యుడు అందుబాటులో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డాక్టర్ పీఎల్ రఘుకుమార్, ఐఎంఏ ప్రెసిడెంట్ యాళ్ల వివేక్, డీఎస్ఓ శంకర్రావు, డెమోలు తదితరులు పాల్గొన్నారు.